క్లుప్తంగా

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాయికల్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని భూపతిపూర్, మూటపల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇటీవల వర్షాలు కురియడంతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, బెక్కం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టిసారించాలి



ఫాగింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న డీపీవో

కథలాపూర్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ అన్నారు. బుధవారం మేడిపెల్లి మండలం కొండాపూర్‌లో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ మిషన్‌ను ప్రారంభించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, ఎంపీవో శ్రీనివాస్, సర్పంచ్ అభిలాశ్, ఉపసర్పంచ్ విజయ, కార్యదర్శి ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణవేణి

మల్లాపూర్: గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్, కృష్ణవేణి అన్నారు.మండలంలోని వేంపల్లి లో నిర్వహించిన ఆయుర్వేద వైద్యశిబిరంలో పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులు, వాతరోగాలు, చర్మసంబంధ, శ్వాసకోశ వ్యాధులు, కీళ్ల నొప్పులు, జీర్ణసంబంధ వ్యాధులు, స్త్రీ సంబంధ సమస్యలపై పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, ఫార్మసిస్ట్ జలంధర్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు ఉత్సవాలు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి ఊరేగింపు ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అడవిలో ఉన్న స్వామివారిని ప్రతీ ఏటా గ్రామంలోకి పల్లకి సేవలో ఊరేగింపుగా తీసుకురావడం ఆనవాయితీ. గ్రామస్తులు స్వామివారికి జలాభిషేకం చేశారు. ఈ ఏటా పంటలు బాగా పండాలని పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ గడీల గంగప్రసాద్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల అర్హుల జాబితా ఇవ్వాలి

జగిత్యాల: డబుల్‌బెడ్‌రూంల గురించి గతంలో దరఖాస్తు చేసుకున్న వారి అర్హుల జాబితా ఇప్పటి వరకు ఇవ్వలేదని, అధికారులను అడిగినా ఇవ్వడం లేదని, లబ్ధిదారుల జాబితా ఇవ్వాలని కలెక్టర్‌కు కౌన్సిలర్ జయశ్రీ బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చాయో లేదో తెలియడం లేదని, మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని, జాబితా అడిగితే ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హుల జాబితాను ప్రకటించి మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంపై శిక్షణ

కోరుట్ల రూరల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం నిర్వహణపై రత్నాకర్ తేజ బీఈడీ కళాశాలలో బుధవారం మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. జిల్లా సెక్టోరియల్ అధికారులు సీహెచ్ సత్యనారాయణ, కె. మహేశ్ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, మండల నోడల్ అధికారి నల్ల శంకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం కే. లలిత పాల్గొన్నారు.

రికవరీ ఉత్తమాటేనా?

- మెట్లచిట్టాపూర్ సొసైటీలో గత పాలకవర్గం, సిబ్బంది అక్రమాలు
- అధికారుల విచారణలో బహిర్గతం
- ఏళ్లు గడుస్తున్నా రికవరీ చేయని వైనం



మెట్లచిట్టాపూర్ సహకార సంఘ కార్యాలయం

మెట్‌పల్లి: 'రాజుల సొమ్ము రాళ్ల పాలు' అన్న చందంగా మారింది. మెట్ల చిట్టాపూర్ సహకార సంఘంలో సొమ్ము.. సొసైటీలో అక్రమాలు జరిగి, అధికారులు విచారణ చేపట్టి ఇంటి దొంగలను గుర్తించినా.. ఇంతవరకు సొమ్ము రికవరీ జాడే లేదు.. మండలంలోని మెట్లచిట్టాపూర్ సహకార సంఘంలో గత పాలకవర్గం, సిబ్బంది కలిసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. పలువురు రైతులు రుణాలు తీసుకోకపోయినా, వారికి ఇచ్చినట్లు చూపి ఆ సొమ్మును సొంతానికి వాడుకున్నారు. అలాగే ఎరువుల విక్రయాలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహణ ద్వారా వచ్చిన సొమ్ములో నుంచి రూ.లక్షలు కాజేశారు. విచారణ జరిపి బాధ్యులను గుర్తించిన అధికారులు.. ఏళ్లు గడుస్తున్నప్పటికీ వారి నుంచి సొమ్మును రికవరీ చేయడం లేదు. ప్రస్తుతం పాలకవర్గం కూడా ఏమాత్రం చొరవ తీసుకోవడం లేదు. 'పోయింది మా సొమ్ము కాదు కదా' అన్నట్లుగా అధికారులు, పాలకవర్గం తీరు ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మింగిన సొమ్ము రూ.45.48లక్షలు

- ఈ సంఘం పరిధిలో 12 గ్రామాలు ఉన్నాయి.
- గత పాలకవర్గంలోని కొందరు సభ్యులు, సిబ్బంది కలిసి రైతులకు తెలియకుండా వారి పేరిట రూ27.77 లక్షలు రుణం కింద తీసుకున్నారు. యూరియా, విత్తనాల అమ్మకాలు..కొనుగోలు కేంద్రాల నిర్వాహణలో వచ్చిన సొమ్ము నుంచి రూ.17.71లక్షలు కాజేశారు.
- దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోగా, వారు విచారణ జరిపి సొమ్ము కాజేసింది నిజమేనని నిర్ధారించారు.
- ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.
- అనంతరం దీనికి బాధ్యుడైన అప్పటి సీఈవోను విధుల నుంచి తొలగించడమే కాకుండా పాలకవర్గాన్ని సైతం రద్దు చేశారు.
- కాజేసిన సొమ్ములో రూ.30 లక్షలు సీఈవో నుంచి, మిగతా మొత్తాన్ని చైర్మన్ నుంచి రికవరీ చేయాలని నిర్ణయించారు.

వసూలు విషయంలో నిర్లక్ష్యం..

- మింగిన సొమ్మును బాధ్యుల నుంచి రికవరీ చేసే విషయంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- నాలుగేళ్ల క్రితం ఈ వ్యవహారం బయటపడినప్పటికీ ఇప్పటికీ ఆ సొమ్మును బాధ్యుల నుంచి రికవరీ చేయకపోవడం గమనార్హం.
- కేవలం కేసు నమోదు చేయించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- నిబంధనల ప్రకారం ముందుగా సొమ్ము చెల్లించాలని బాధ్యులకు నోటీసులు ఇవ్వాలి. వాటికి స్పందించని పక్షంలో వారి ఆస్తులను జప్తు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

చర్యలు తీసుకుంటాం



గత పాలకవర్గంలో జరిగిన అవినీతికి అప్పటి చైర్మన్, సీఈవోలను బాధ్యులుగా గుర్తించారు. సొమ్ము రికవరీ విషయంలో చైర్మన్‌గా ఉన్న శంకర్‌రెడ్డికి ఇప్పటికీ పలుమార్లు నోటీసులు ఇచ్చాం. కానీ ఆయన వాటిని తీసుకోకుండా తిప్పి పంపుతున్నారు. ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– నవీన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్

- కానీ ఇంతవరకు వారికి నోటీసులు కూడా ఇవ్వలేదని తెలిసింది.
- సొమ్ము రికవరీ జరిగితే సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి అవకాశముంటుంది. దీనిని అటు అధికారులు, ఇటు పాలకవర్గం పట్టించుకోకపోవడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధైర్యపడొద్దు.. రైతులకు అండగా ఉంటాం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



పెద్ద చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

మల్లాపూర్: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలు, రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వ పరంగా అండగా నిలుస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు సాతారం, గుండంపల్లి, రేగుంట, గొర్రెపల్లి గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన పంటలను, దెబ్బతిన్న రోడ్లను, గండిపడ్డ చెరువులను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులు, బాధిత ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయం అందించాలని సూచించారు. భారీ వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమత్తులు చేపట్టాలని సంబంధిత అధికారుల ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వాలని, గండిపడ్డ చెరువులను వెంటనే పూడ్చి వరదనీరు వెళ్లిపోకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జగదీష్, ఏవో లావణ్య, ఏఈలు రాకేశ్, వేణు, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు

కోరుట్ల రూరల్: వరదలతో కోతకు గురైన, రోడ్లు కల్వర్టులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడతామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, దారిశెట్టి రాజేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన నాయకులు

కొండగట్టు: కొడిమ్యాల ఎంపీపీ మేనేని స్వర్ణలత జన్మదినం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. 300 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంకు ఎంపీపీ హాజరై ప్రాథమిక స్థాయిలో విద్యార్థులంత కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించాచేలా చూడాలని ఉపాధ్యాయులకు తెలిపార. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిమెట్టు విజయవంతం చేయలన్నారు.కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ మేనేని రాజనర్సింగరావు, వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్, నాయకులు మల్లరెడ్డి పులి వేంకటేశం అంకం రాజేశం నేరేళ్ల మహేశ్ పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



బీర్‌పూర్‌లో అంబులెన్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందజేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలానికి మంజూరైన అంబులెన్స్‌ను ప్రారంభించారు. అనంతరం రూ. 5 లక్షలతో నిర్మించనున్న ఆర్‌ఎంపీ,పీఎంపీ అసోసియేషన్ సంఘం భవనానికి భూమిపూజ చేశారు. బీర్‌పూర్‌లో త్వరలో పూర్తిస్థాయిలో పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం 17 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల చేరిక

బీర్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నారపాక రమేష్, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

జగిత్యాల: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జగిత్యాల అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ముఖ్యమంత్రి ఎప్పుడు అండగా ఉంటారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బేస్ క్యాంప్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

రాయికల్: అటవీశాఖలో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న బేస్‌క్యాంప్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరుతూ బేస్ క్యాంప్ కాంట్రాక్ట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురావు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అటవీశాఖలో 3220 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని, వారిని రెగ్యులర్ చేసేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ప్రధాని, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎంపీ బండి సంజయ్‌కుమార్ చిత్రపటాలకు బుధవారం బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మేడిపెల్లి–గోవిందారం డబుల్ రోడ్డు పనులకు కేంద్రం రూ. 22 కోట్లు నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించినందుకు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు క్యాతం దశరథంరెడ్డి, కరండ్ల మధుకర్, ఎస్‌ఎన్‌రెడ్డి, జలపతిరెడ్డి, మేకల రాజు, సత్యనారాయణ, మధు, రఘు, రత్నాకర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలకు బదిలీల బాధ్యత పీఆర్‌టీయూఎస్‌దే

బుగ్గారం: మండలంలోని వివిధ పాఠశాలల్లో 317 ద్వారా నష్టపోతున్న ఉపాధ్యాయులను తిరిగి బదిలీపై సొంత జిల్లాలకు తీసుకువచ్చే బాధ్యత పీఆర్‌టీయూటీఎస్‌దే అని ఆ సంఘ ప్రధాన కార్యదర్శి బోయినపెల్లి ఆనందరావు అన్నారు. మండలంలోని చిన్నాపూర్,యశ్వంతరావుపేట,శెకెల్ల, సిరికొండ,వెల్గొండ, మద్దునూర్, చిన్నాపూర్ గ్రామాల్లో సంఘ సభ్యత్వాలను నమోదు చేశారు. కార్యక్రమంలో చిట్నేని విజయ్‌కుమార్, వేణుగోపాల్,సత్యనారాయణ, బాలాగంగాధర్, వంశీ, వివేక్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు తొలిమెట్టు

మల్యాల: విద్యార్థులు కనీస సామర్థ్యాలతోపాటు తరగతికి సంబంధించిన సామర్థ్యాలు సాధించి విద్యార్థుల భవిష్యత్‌కు తొలిమెట్టు బాటలు వేయాలని మల్యాల మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాటిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నుంచి ఆగస్టు 8 వరకు 75 మంది ఉపాధ్యాయులకు తొలిమెట్టుపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో ఐత శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్య అందించటానికి, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి గౌతమ్‌కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేసిన బీడీ టేకేదార్లు

జగిత్యాల: గవర్నర్ కోటాలో కుర్రు సత్యనారాయణకు ఎమ్మెల్సీ పదవీ కేటాయించిన సందర్భంగా జిల్లా ఎరుకల సంఘం నాయకులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మా వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. సమావేశంలో తెలంగాణ ఎరుకల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, కార్యవర్గ సభ్యులు సారయ్య, గంగాధర్, గంగయ్య, మధు, గంగాధర్, పోశయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీడీ టేకేదార్ల క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం: బీడీ కంపెనీ టేకేదారులకు రూ. 2 వేలు ఆసరా పింఛన్ ఇచ్చేందుకు ఆమోదం తెల్పడంతో బుధవారం మండలకేంద్రంలో బీడీ కంపెనీ టేకేదారులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు, కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ బీడీ కార్మిక సంఘం నాయకులు ఎండీ మౌలానా టేకేదార్లు దాసరి రాములు, కమటం గోవర్ధన్, చాట్ల శ్రీనివాస్, గజెంగి దయానంద్ పాల్గొన్నారు.

మల్యాల: బీడీ టేకేదార్లకు పెన్షన్ ఇస్తూ సీఎం కేసీఆర్ ప్రకటన చేయడంపై బీడీ టేకే దార్లు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మల్యాల అంగడిబజార్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆసరా పెన్షన్ ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీడీ టేకేదార్ల జిల్లా అధ్యక్షుడు క్యాతం మల్లారెడ్డి, గాజుల రాములు,ముల్లయ్య, దేవరాజం, బక్కన్న, పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

పెగడపల్లి: మండలంలోని పలు ఆలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నిధులు మంజూరయ్యాయి. మండలంలోని వెంగయిపేట శివాలయం, బతికపల్లి కొచ్చెరువు గుట్ట హనుమాన్ ఆలయం, మద్దులపల్లి మల్లికార్జునస్వామి, లింగాపూర్ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయాల అభివృద్ధికి రూ. 10 లక్షల చొప్పున మంత్రి ఈశ్వర్ ప్రతిపాదన మేరకు టీటీడీ సభ్యుడు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కృషితో నిధులు మంజూరైనట్లు ఆలయాల కమిటీ చైర్మన్లు తెలిపారు.

వేంకట్వేర ఆలయానికి రూ. 10 లక్షలు ..

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి టీటీడీ ద్వారా రూ. 10 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ మొలిగె లక్ష్మి బుధవారం పేర్కొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రత్యేక చొరవ చూపి దేవాలయానికి నిధులు కేటాయించారన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కోరుట్లకు రూ. 10 కోట్లు మంజూరు

కోరుట్ల: కోరుట్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రూ. 10 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు. ఈ నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం

కోరుట్ల రూరల్: రాష్ట్రంలో రైతులకు రూ.1 లక్ష రుణ మాఫీ చేయాలని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలో, గ్రామాల్లో కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు.

వర్షపు నీరు కాదు.. భగీరథ పైప్‌లైన్ లీకేజీ



జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని 10వ వార్డు తులసీనగర్‌లో వారం రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ అవుతుండటంతో మంచినీటి వృథాతో పాటు ఇళ్ల మధ్య నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా లీకేజీ పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

సైబర్ నేరాలపై యువకులకు అవగాహన

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో యువకులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి లింకులు పంపిస్తే స్పందించవద్దన్నారు కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది నీలా నాయక్, కిష్టయ్య, నవీన్, మదన్‌లాల్ పాల్గొన్నారు.

సారంగాపూర్: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సారంగాపూర్ ఎస్సై తిరుపతి అన్నారు. బుధవారం సారంగాపూర్ మండల కేంద్రంలో పోలీసులు సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బుగ్గారం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలో సాంబశివ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఆధారిత యంత్ర పరికరాల అద్దె కేంద్రాన్ని (కస్టమ్ హైరింగ్ సెంటర్) స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుచేందర్, ఎంపీడీవో తిరుపతి, సర్పంచ్ మూల సుమలత, కోఆప్షన్ సభ్యుడు రహమాన్, నాయకులు మూల శ్రీనివాస్‌గౌడ్, దాసరి లచ్చయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు జోగినిపెల్లి సరిత, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కథలాపూర్: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి అన్నారు. ×గిఫ్ట్ ఏ స్మైల్® కార్యక్రమంలో భాగంగా కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లిలో ఉపాధిహామీ కూలీలకు బుధవారం హాట్ బాక్సులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చుక్క దేవరాజం, సర్పంచ్ ఎం.జీరెడ్డి, ఎంపీటీసీ మల్యాల రమేశ్ పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: మన ఊరి మన బడి పనులు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ, ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. బుధవారం మండలంలోని గోధూర్‌లో రూ. 30 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, ప్రాథమిక పాఠశాలలో పనులను పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఆర్‌అండ్‌బీ ఏఈ వేణు, హెచ్‌ఎం నాగరాజు,నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలు ఇబ్బంది పడుతుంటే సీఎం మహారాష్ట్ర పర్యటన'

మల్యాల: తెలంగాణలో భారీ వర్షాలతో పొలాలు నీట మునిగి, ఇళ్లలోకి నీరు చేరి, ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉంటే సీఎం కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనకు వెళ్లడం సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ అన్నారు. మల్యాల మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయని, ప్రజలు భారీ వర్షాలతో ఇబ్బందిపడుతుంటే సీఎం కేసీఆర్ ప్రజల బాధలను గాలికి వదిలేసి, పర్యటనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, మారంపల్లి గంగాధర్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి, రామగిరి మురళి, మల్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కటుకం వినయ్ హరినాథ్ పాల్గొన్నారు.

దళితబంధు అమలు ప్రచారంలోనే..

సారంగాపూర్: ప్రభుత్వం దళిత బంధు పేరుతో దళితులకు ఆర్థికసాయం రూ. 10 లక్షలు అందిస్తామని మూడేళ్లుగా చెబుతున్నా, ఇప్పటికి దళితుల్లో కనీసం 20 శాతం మంది దళితులకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరలేదని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు అన్నారు. బుధవారం బీర్‌పూర్ మాట్లాడారు. ప్రతి దళితునికి ఈ పథకం ద్వారా రూ. 10 లక్షలు అందించేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీటీసీలు ఆడెపు మల్లీశ్వరి, రంగు లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డులతో విజ్ఞప్తి

మెట్‌పల్లి/ధర్మపురి: ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో స్థానిక జర్నలిస్టులు బుధవారం పోస్టు కార్డులతో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలకంగా వ్యవహరించారని, ఆ సేవలను పరిగణనలోకి తీసుకొని ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా హెల్త్ స్కీంను అమలు చేయడంతో పాటు ఇండ్లను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు ఉన్నారు.

వేపకుంట మత్తడి ధ్వంసం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామ శివారులోని వేపకుంట మత్తడిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో నీరంతా వృథాగా పోతుందని గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు వేపకుంటలో నీళ్లు పుష్కలంగా చేరాయన్నారు. మత్తడిని ధ్వంసం చేయడంతో తమ వరి పొలాల్లోకి నీళ్లు చేరి నష్టం జరిగిందన్నారు. ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు పల్లె గంగాధర్ కోరారు. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల/ఇబ్రహీంపట్నం: పట్టణంలో ఈ నెల 13 న జరిగే రాష్ట్ర స్థాయి పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి పోస్టర్‌ను స్థానిక పద్మశాలీ భవనంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది పద్మశాలీలు ఉన్నప్పటికీ రాజ్యాధికారంలో సరైన గుర్తింపు ఉండటం లేదన్నారు. సదస్సులో పద్మశాలీ కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియేట్‌లో ఐదు సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పత్తెం శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో ఎస్సీ-1, బీసీ ఏ-1, బీసీ డీ-1 ఓపెన్-2 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు ఆగస్టు 3 సాయంత్రం లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.